క్లుప్తంగా

హోరాహోరీగా మండల స్థాయి క్రీడలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

యల్లనూరు: మండలంలోని చిలమకూరు ఆదర్శ పాఠశాలలో గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. అండర్–14 ఎస్‌ఈఎఫ్‌ఐ క్రీడల్లో భాగంగా ఖోఖో, కబడ్డీ, బ్యాట్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేష్, పీడీలు ప్రసాద్ నాయక్ (చిలమకూరు), బాల మధుసుధన్‌రెడ్డి (తిమ్మంపల్లి), శ్రీనివాసరావు(కూచివారిపల్లి) తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన



ధర్మాపురంలో పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుత్తి: మండలంలోని ధర్మాపురం గ్రామ సమీపంలో రైతులు సాగు చేసిన పంటలను రేకుల కుంట శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. శాస్త్రవేత్తలు విజయశంకర్ బాబు, భాస్కర్‌రావు, లక్ష్మణ్, నసిరుద్దిన్‌తో పాటు ఏడీఏ వెంకటరాముడు, ఏఓ మెహరున్నీషా తదితరులు వేరుశనగ, కంది, ఆముదం, సజ్జ పొలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి, ఏఏ మందులు పిచికారీ చేయాలో రైతులకు సూచించారు.

జిల్లా అధ్యక్షుడిని కలసిన నాయకులు



అనంత వెంకటరామిరెడ్డిని కలసిన నాయకులు

గార్లదిన్నె: వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అనంత వెంకటరామిరెడ్డిని గురువారం అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, అట్లే శ్రీనివాసులు, షేక్షావలి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: మండలంలోని ఆలూరు కోనలో వెలసిన భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ రంగనాథస్వామి ఆలయంలో ఉన్న హుండీల్లో కానుకలను గురువారం లెక్కించామని దేవదాయ శాఖ ఈఓ సుబ్రమణ్యం తెలిపారు. గత ఏడాది అగస్టు 8 నుంచి గురువారం వరకూ రూ. 27,24,184 ఆదాయం వచ్చిందన్నారు. హుండీ లెక్కింపులో సిబ్బంది పాల్గొన్నారు.

జనావాసంలోకి నెమలి



నెమలిని అప్పగిస్తున్న వన్‌టౌన్ పోలీసులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పాతబస్టాండ్ బంగారు షాపుల కాంప్లెక్స్ ఆవరణలో జనావాసాల మధ్యకు వచ్చిన ఓ నెమలిని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం సాయంత్రం బంగారు షాపు ఆవరణలోని చెట్టు మీద నుంచి దాదా అనే వ్యక్తి దుకాణం వద్దకు నెమలి వచ్చింది. దుకాణదారులు నెమలిని వన్‌టౌన్ పోలీసుల సమక్షంలో ఫారెస్ట్ బీట్ అధికారి రాజేశ్వరికి అప్పగించినట్లు వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

పామిడి: పట్టణంలోని 5వ వార్డు జెడ్పీహైస్కూల్‌లో గురువారం సాయంత్రం ఉత్తమ టీచర్ అవార్డు గ్రహీత (ఎస్‌ఏ–తెలుగు) నీలం ప్రిస్కిల్లాను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం ఎస్.శ్యామల, ఉపాధ్యాయులు యల్లప్ప, రామ్మోహన్, రజియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం





గుత్తిలో మాట్లాడుతున్న సీడీపీఓ ఢిల్లీశ్వరి, పెద్దపప్పూరులో పౌష్టికాహారాన్ని అందజేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నారాయణమ్మ

గుంతకల్లు రూరల్/గుత్తి/పామిడి/పెద్దపప్పూరు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సీడీపీఓ ఢిల్లీశ్వరి అన్నారు. పట్టణంలోని శ్రీ సాయి ఉన్నత పాఠశాలలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డలకు తల్లి పాలు తాపించాలన్నారు. తల్లి పాలలో ప్రొటీన్‌లు, విటమిన్‌లు పుష్కలంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ నాగేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమా, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

• గుంతకల్లు మండలంలోని పులగుట్టపల్లి చిన్నతండా గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వహీదా వివరించారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం లోకేష్, ఎంఎల్‌హెచ్‌పీ వాణి, ఏఎన్‌ఎం దేవి, గ్రామస్తులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

• పామిడి పట్టణంలో ఉన్న మంజుటాకీస్ వీధిలోని అంగన్‌వాడీ కేంద్రం–8లో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు కే జయంతి, కే షెకున్‌బీ, ఆయాలు సీ కీర్తి, ఎస్ మాబున్ని, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

• పెద్దపప్పూరు మండలంలోని షేక్‌పల్లి, పసలూరు గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నారాయణమ్మ, రామలక్ష్మమ్మ, అంగన్‌వాడీ టీచర్ సుచరిత తదితరులు పాల్గొన్నారు.

‘వరి గ్రామీణోత్పత్తి’పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అనంతపురం డీఆర్‌సీ పీడీ శైలజా కుమారి

పామిడి: మండలంలోని పాళ్యంలో రైతుసేవా కేంద్రంలో గురువారం వరి గ్రామీణోత్పత్తి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా రిసోర్స్ సెంటర్ పీడీ శైలజ కుమారి హాజరయ్యారు. మంచి విత్తనం ఎంపిక, మంచి విత్తనం పొందుటకు సీడ్ విలేజ్ పోగ్రామ్ ద్వారా తీసుకోవాల్సిన సూచనలను, సలహాలను ఆమె రైతులకు వివరించారు. అనంతరం ఆమె గ్రామంలో సాగు చేసిన వరి పొలాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు కార్బెండిజిమ్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. 25–30 రోజుల వ్యవధిలో నాటుకోవాలన్నారు. నారు మడి తీసిన తర్వాత కొనలను తుంచి నాటాలన్నారు. ఎరువుల యాజమాన్యం, సుడిదోమ, కలుపు నివారణలోని సమగ్ర సస్య రక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఏఓ లీనా వసుంధర, టెక్నికల్ ఏఓ శంకర్‌లాల్ నాయక్, ఏఈఓ శ్రీనివాసరావు, ప్రసాద్, ఎంపీఈఓ రాధారాణి, రైతులు నారాయణస్వామి, ఆదినారాయణ, తిరుపతయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అండ



చెక్కు అందజేస్తున్న సమన్వయకర్త వీరాంజనేయులు

బుక్కరాయసముద్రం: కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ శింగనమల నియోజక వర్గం సమన్వయ కర్త వీరాంజనేయులు అన్నారు. మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆదిలక్ష్మి ఇటీవల టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన సంగతి తెలిసిందే. దీంతో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధితురాలికి రూ. 50 వేలు విలువ చేసే చెక్కును పంపించారు. చెక్కును సమన్వయ కర్త వీరాంజినేయులు ఆమెకు అందజేశారు. ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆదిలక్ష్మిని నియోజకవర్గ నాయకుడు ఆలూరి సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ రంగయ్య పరామర్శించి విషయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు వీరాంజినేయులు తెలిపారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యకర్తలు అధైర్య పడకూడదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొర్రపాడు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ప్రాక్టీషనర్స్ ఇంజెక్షన్ వేయొద్దు



మాట్లాడుతున్న వైద్యాధికారి సుధాకర్

పామిడి: ప్రైవేట్ ప్రాక్టీషనర్లు ఎటువంటి పరిస్థితుల్లో రోగులకు ఇంజెక్షన్ వేయకూడదని ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఆర్‌ఎంపీ, పీఎంపీల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యం కోసం వచ్చిన రోగులకు కేవలం ప్రథమ చికిత్స చేసి ఆరోగ్యకరమైన సలహాలిచ్చి రోగం తీవ్రతను బట్టి దగ్గరలోని ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. ఎటువంటి పరిస్థితుల్లో ఐవీ ఫ్లూయిడ్స్, స్టిరాయిడ్స్ ఇవ్వకూడదన్నారు. కేవలం వారు మందులు మాత్రమే ఇవ్వాలన్నారు. వారి పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోకూడదన్నారు. ఈ నిబంధనలు పాటించని వారు శిక్షార్హులవుతారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీరామ్‌రెడ్డి, సుధాకర్, సురేంద్రరెడ్డి, వైద్య సిబ్బంది, ఆర్‌ఎంపీ, పీఎంపీలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నియంత్రించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

గుంతకల్లు రూరల్: బాల్య వివాహాల నియంత్రణలో మహిళా పోలీసులు కీలక పాత్ర పోషించాలని రూరల్ ఎస్‌ఐ రాఘవేంద్రప్ప సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నియంత్రణ, ఆన్‌లైన్ సేఫ్టీ తదితర వివరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులతో నిర్వహించిన కార్యక్రమంలో రూరల్ ఎస్ రాఘవేంద్రప్ప, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి, హ్యాండ్స్ కోఆర్డినేటర్ నాగలక్ష్మి తదితరులు మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించాలన్నారు. 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు పెళ్లి చేస్తే రూ.లక్ష జరిమానాతోపాటు, రెండు సంవత్సరాల జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు.

సర్పంచుల తీర్మానం తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వీరరాజు

యల్లనూరు: పశువుల షెడ్లకు గ్రామ సర్పంచుల తీర్మానం ఉండాలని, ఎస్సీ , ఎస్టీ కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ వీరరాజు సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అలాగే రైతులు పండ్ల మొక్కలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు, టీఏలు ప్రతాప్, జయరాం, శంకర్, అదిల్, శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

మండలంలోని అన్ని పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపేందుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వీరరాజు, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెత్తతో సంపద తయారీ కేంద్రాలు, పంచాయతీల అభివృద్ధి తదితర పనులపై ర్యాలీలతో పాటు రోజు వారి కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శులు నిర్వహించాలన్నారు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం



విరాళాల సేకరణకు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

గుంతకల్లు: వరద బాధితులకు అండగా నిలుద్దాం అంటూ శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాల విద్యార్థులు నినాదించారు. గురువారం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పట్టణంలో తిరుగుతూ ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోపాల్ మాట్లాడుతూ వరదలతో తీవ్రంగా నష్టపోయిన విజయవాడ ప్రజలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.గోవిందు, నాయకులు మహేష్, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రాము రాయల్, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

నిట్టూరులో తాగునీటి కష్టాలు



నిట్టూరులో ఎద్దుల బండితో నీటిని తెచ్చుకుంటున్న ప్రజలు

యల్లనూరు: మండలంలోని నిట్టూరు గ్రామంలో తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. మూడు రోజులుగా నీరు అందక గ్రామస్తులు అల్లాడిపోతున్నారు. కొళాయిలకు నీరు రాకపోవడంతో వ్యవసాయ బోరు వద్దకు వెళ్లి ఎద్దుల బండిపై నీటిని తెచ్చుకుంటున్నారు. నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని దళితవాడవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణిని అడుగగా కొళాయిలకు నీరు తక్కువగా వస్తున్నందున సమస్య నెలకొందన్నారు.. నీళ్ల వదిలేందుకు చర్యలు తీసుకుంమన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

యాడికి: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వ్యాప్తిపై అప్రమత్తంగా వ్యవహరించాలని యాడికి పీహెచ్‌సీ వైద్యులు శ్రీరామ్‌కుమార్, పరమేశ్వర్, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం యాడికి పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలతో వారు సమావేశమై మాట్లాడారు. సీజనల్ వ్యాధుల కేసులు నమోదైన ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు చర్యలు తీసుకోవాలని, దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయించాలన్నారు. ఫ్రైడే ..డ్రైడేను పగడ్బందీగా అమలు చేయాలన్నారు. అంతకుముందు వారు ఈ నెల 17న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: స్థానిక బాలుర, బాలికల వసతి గృహాల్లో గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు అమర్‌నాథ్, మలేరియా గుత్తి సబ్ యూనిట్ అధికారి వినయ్ మాట్లాడుతూ విద్యార్థులు రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్‌లు సంజీవరాయుడు, ఉమాదేవి, ఆరోగ్య సిబ్బంది రాజమ్మ, ఉమాదేవి, హజరత్‌బీ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి

పెద్దవడుగూరు: రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు అందించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి దస్తగిరి, మండల ఉపాధ్యక్షుడు ఈశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గ్రామ సచివాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులను ఆదుకుంటామని చెప్పిన నేతలు రైతుల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు రద్దు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రైతులు సుధీర్, గోవింద్, మస్తాన్, శేఖర్, శ్రీరామిరెడ్డి, సుంకన్న, బాలాజి, శివప్రసాద్‌ఆచారి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి శత జయంతి ఉత్సవాలు

పామిడి: పట్టణంలో గురువారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి శత జయంతి ఉత్సవాలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో వైద్యాధికారి జీ శివకార్తీక్‌రెడ్డి సమక్షంలో రోగులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో ఆ సమితి అధ్యక్షుడు కే విశ్వనాథ్, సభ్యులు ప్రశాంత్, మంజు, హనుమంతరెడ్డి, సుభాస్, సుదీర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘శ్రీనిధి రికవరీ లో నిర్లక్ష్యం తగదు’

పెద్దవడుగూరు: మహిళా సంఘాల నుంచి శ్రీనిధి డబ్బులు రికవరీ చేయించడంలో నిర్లక్ష్యం తగదని డీఆర్‌డీఏ ఏజీఎం అనుమేష్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నాగలాపురం వీఓలో మూడు సంఘాల నుంచి శ్రీనిధి డబ్బులు గత మూడేళ్లుగా రికవరీ కాకపోవడంతో ఆయన విచారణ చేపట్టారు. శ్రీనిధి డబ్బులు తీసుకున్నవారు రెండు సంవత్సరాల్లోనే చెల్లించాలన్నారు. మూడేళ్ల గడుస్తున్నా ఎందుకు రికవరీ చేయడం లేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా ఏడు వీవోలు ఎన్‌పీఏ కిందకు చేరాయని, వాటిపై కూడా విచారణ చేపడతామన్నారు. కార్యక్రమంలో మేనేజర్లు నాగార్జున, రాజశేఖర్, ఏపీఎం శారద, సీసీలు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాద దాటికి విరిగిన విద్యుత్ స్తంభం

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని కొత్త బ్రిడ్జి వద్ద ఉన్న గంగమ్మ దేవాలయం సమీపంల వ్యవసాయ సర్వీసులకు వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను గురువారం భారీ వాహనం ఢీకొనడంతో తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో రోడ్డుపై వాహనాల రాకపోకలు లేకపోవడంతో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. తమిళనాడు రాష్ట్రం నుంచి నంద్యాల జిల్లాలోని పవర్ గ్రిడ్‌కు భారీ వాహనంలో యంత్రాన్ని తీసుకెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. హైటెన్షన్ లైన్‌కు చెందిన విద్యుత్ తీగలు తగలడంతో విద్యుత్ స్తంభం వంగిపోయి తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. విషయం తెలుసుకున్న జూనియర్ లైన్‌మైన్ ప్రదీప్ సిబ్బంది వచ్చి ప్రమాదంపై అంచనా వేశారు. ప్రమాదంలో రూ.78వేలు నష్టం వాటిల్లిందని వారు తెలిపారు. నష్టం చెల్లించేంత వరకు వాహనాన్ని పంపేది లేదన్నారు. ప్రమాదంపై డీఈఈ దృష్టికి తీసుకెళ్లామన్నారు. చుక్కలూరు ఫీడర్‌కు సంబంధించిన లైన్లు తెగిపోవడంతో పెన్నానది పరివాహక ప్రాంతంలోని విద్యుత్ సర్వీసులకు అంతరాయం కలగకుండా ముందస్తు జగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. కాగా ప్రమాద విషయం పోలీసులకు తెలపకపోవడం గమనార్హం.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటిపై దౌర్జన్యం

యల్లనూరు: యల్లనూరులో తమ ఇంటిపై బుధవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు జగదేక్, నాగేంద్ర, దుబ్బన్న దౌర్జన్యం చేశారని వైఎస్సార్‌సీపీ కార్యకర్త జయన్న, ఆయన కుమారుడు ఉత్తప్ప తెలిపారు. వివరాల మేరకు.. బుధవారం జరిగిన గొడవ కారణంగా జయన్న ఇంట్లోకి ముగ్గురు వ్యక్తులు చొరబడి ఇంట్లో ఉన్న బయన్న భార్య పెద్దక్క, కూతురు జ్యోతిలను బెదిరించి ఇంట్లోని బియ్యం, ఇతర సామగ్రిని ధ్వంసం చేసి బెదిరించారన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకోవడం లేదన్నారు. పోలీసులు స్పందించి కేసు నమోదు చేసుకోవాలని బయన్న, ఉత్తప్ప కోరారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

గార్లదిన్నె: ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత గురువారం మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. యర్రగుంట్లకు చెందిన శోభ(22)కు కోటంకకు చెందిన చిదానందతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. పిల్లలు పుట్టకపోవడంతో అత్త నాగలక్ష్మి, భర్త ఆమెను వేధిస్తుండేవారు. ఈక్రమంలో వేధింపులు తాళలేక బుధవారం విషద్రావకం తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

‘అంజుమన్ ’ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా అంజుమన్–ఎ–ఇస్లామియా కమిటీ ఆధ్వర్యంలో గురువారం అంజుమన్ స్ట్రీట్‌లో ప్రజలకు అన్నదానం చేశారు. తొలుత ముస్లిం మతపెద్దలు విశ్వశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్, కమిటీ సభ్యులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

విత్తన పంపిణీ పక్కదారిపై విచారణ



దోసలుడుకి రైతు భరోసా కేంద్రంలో విచారణ చేస్తున్న అధికారులు

గుంతకల్లు రూరల్: 2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు తలెత్తడంతో జిల్లా వ్యవసాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ఓబుళాపురం, దోసలుడుకి, మొలకలపెంట రైతు భరోసా కేంద్రాల్లో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ చిన్నమ్మ, ఉరవకొండ ఏడీఏ పద్మజ ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో సమావేశం నిర్వహించి విత్తన పంపిణీ కార్యక్రమం ఎలా సాగింది? రైతులకు సబ్సిడీ విత్తనాలు అందాయా, వారు ఆ విత్తనాలను సాగుచేశారా తదితర వివరాలపై ఆరా తీవారు. రైతులు ప్రతి ఒక్కరూ తాము సబ్సిడీ విత్తన వేరుశెనగ తీసుకున్నట్లు ధ్రువీకరిండంతో అధికారులు వివరాలను నమోదు చేసుకున్నారు. గుంతకల్లు అగ్రికల్చర్ ఆఫీసర్ స్వాతి వారితో ఉన్నారు.

రస్తా వివాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: మండలంలోని కె.ఊబిచెర్ల గ్రామంలో గురువారం పొలాలకు వెళ్లే రస్తా విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ, వివాదం చోటు చేసుకుని ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కె.ఊబిచెర్ల గ్రామానికి చెందిన నాగిరెడ్డి, గంగరాజు వర్గాల మధ్య గత కొన్నేళ్లగా రస్తా తగాదా నడుస్తోంది. ఈ క్రమంలో గురువారం వారు గొడవ పడడంతో నాగిరెడ్డి, గంగరాజుకు తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరిని మొదట గుత్తి ఆస్పత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఘటనపై సీఐ వెంకటేశ్వర్లు దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులు ఉల్లాసంగా ఉండాలి

పెద్దవడుగూరు: విద్యార్థులు మానసిక ఉల్లాసంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ నాయక్, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి సూచించారు. గురువారం మండలంలోని చిత్రచేడు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు మానసిక ఉల్లాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అష్టాదశ పీఠాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక విగ్రహాలకు నిమజ్జనం



చిత్రావతి నదిలో నిమజ్జనం చేసిన విగ్రహాలు

సాక్షి ఎఫెక్ట్..

యల్లనూరు: ఎట్టకేలకు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండలంలోని చిత్రావతి నదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయకుండా వదిలేసిన సంగతి తెలిసిందే. మంగళవారం సాక్షి పత్రికలో ‘గణనాథా మన్నించు’ అనే శీర్షికను కథనం ప్రచురించగా వెంటనే అధికారులు స్పందించారు. నది బయట వదిలేసిన వినాయక విగ్రహాలకు నిమజ్జనం చేశారు. దీంతో మండలవాసులు ఆనందం వ్యక్తం చేస్తూ ‘సాక్షి’ని అభినందించారు.

పాముకాటుతో యువకుడికి అస్వస్థత

గుత్తి: మండలంలోని అబ్బేదొడ్డిలో రూపేష్ కుమార్ అనే యువకున్ని కట్ల పాము కాటు వేసింది. ఈ ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. రూపేష్ కుమార్ ఇంటి ఆవరణలో కూర్చొని ఉండగా పాము కాటు వేసింది. గమనించిన స్థానికులు పామును చంపి వేశారు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు.